క్లుప్తంగా

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను పెద్దమందడి ఎమ్మార్సీ భవనం వద్ద తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చేసిన ఘనత తపస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపినాథ్, అశ్విని రవికుమార్, గిరిజాచారి, రాములు, కురుమూర్తి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్యకు నివాళి



పెబ్బేరు రూరల్: ఐదు దశాబ్దాలు పేదల పక్షాన అలుపెరగని పోరాటం సాగించిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు, జిల్లా మాజీ కార్యదర్శి దివంగత డి చంద్రయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య, రాబర్ట్, మోషే, గంధం రాజు, కుర్మయ్య, కృష్ణయ్య, నాగరాజు, కళావతమ్మ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య ఎల్‌టీ వైర్లు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కాశీంనగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్, ఇళ్లపై ఎల్‌టీ లైన్ వైర్లు ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ కోరారు. ఆయన మంగళవారం కాశీంనగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఇళ్ల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్, ఎల్‌టీ లైన్లు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా సమస్యను అధికారులు, స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించామని, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని లేదంటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, చంద్రమోహన్, రాములు, నరసింహ, వెంకటయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతాన్ని గ్రామంలోని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, వారి ఎత్తు, బరువులను అంగన్‌వాడీ టీచర్లు నమోదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరీ, హెల్పర్లు ఈశ్వమ్మ, లచ్చమ్మ, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎల్లమ్మ పాల్గొన్నారు.

సినిమాలు నైతిక విలువలను పెంపొందించాలి

కొత్తకోట రూరల్: సినిమాలు నైతిక విలువలను పెంపొందించేలా ఉండాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. కేంద్ర ఫిలిం బోర్డు సలహా కమిటీ ప్రాంతీయ సభ్యుడిగా ఎన్నికైన కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన పబ్బ నరేందర్‌గౌడ్‌ను మంగళవారం సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమాలు యువతకు చక్కటి దిశానిర్దేశం చేస్తూ, నైతిక విలువలను పెంపొందించేలా ఉండాలన్నారు. హింసాయుత సన్నివేశాలను వీలైనంత వరకు తగ్గించి, సమస్యలకు సానుకూల పరిష్కారం లభించే విధంగా సినిమాల్లో చూపిస్తే బాగుంటుందని సినీ వర్గాలకు సూచించారు. అందుకు ఫిలింబోర్డు వారు తమ సలహాలు, సూచనలు బలంగా వినిపించాలని కోరారు. మన ప్రాంతం వారిని కేంద్ర ఫిలిం బోర్డులో సలహా సభ్యుడిగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య క్లబ్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్‌గౌడ్, తేజవర్ధన్, బండారు శ్రీనివాస్, లక్ష్మయ్య, వెంకట్రాములు, మధుగౌడ్ తదితరులు ఉన్నారు.



దరఖాస్తు ఒక్కటే..



గోప్లాపూర్‌లో ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- అనుమానాలు అనేకం
- ప్రజాపాలన సందేహాలకు సమాధానం కరవు
- దరఖాస్తులపై ప్రజల ఆందోళన

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తంలో భాగంగా ఐదు గ్యారెంటీలైన మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహాజ్యోతి, చేయూత పథకాలను అర్హులకు అందించడంలో భాగంగా ఒకే దరఖాస్తును నింపి ఇవ్వమనడంతో ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లబ్ధి పొందుతున్న ఏ పథకాలకు కోత పడుతుందోనన్న భయంతో సర్వే వివరాలు ఇవ్వడం లేదు. వివరాలు రాసే సమయంలో అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా అంశాల్లో స్పష్టత లేకపోవడంతో అధికారులు సైతం సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని ఆందోళన చెందుతున్నారు.

మండలాల వారీగా మంగళవారం వరకు వచ్చిన దరఖాస్తులు ఇలా..	
మండలం	వచ్చిన దరఖాస్తులు
చిన్నంబావి	2,800
పాన్‌గల్	4,280
వీపనగండ్ల	3,330

ప్రజల సందేహాలివి..

■ మహాలక్ష్మి పథకంలో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళలకు (కుటుంబంలో ఒకరికి)నెలకు రూ.2500 ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశం. రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో చాలామంది ఆందోళన చెందుతున్నారు. పెళ్లయిన ఆడపిల్లలు తమ ఆధార్ కార్డులో భర్త ఇంటి పేరుతో పాటు చిరునామాలు మార్చుకున్నారు. ఇంటి పేరు మారడం, అత్తగారింట్లో రేషన్‌కార్డులో పేరు లేకపోవడంతో ఏం రాయాలో తెలియక ఈ పథకం వస్తుందో రాదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

■ రైతు భరోసా.. యజమాని పేరుతో దరఖాస్తు చేస్తే ఇంట్లో మిగిలిన వారి పేరు మీద ఉన్న సర్వే నంబర్లు ఎలా ఇవ్వాలో తెలియడం లేదు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఇక్కడే ఉన్నాయి. కానీ వ్యవసాయ భూమి మాత్రం మరో జిల్లాలో ఉంది. కౌలు తీసుకున్న రైతులు దరఖాస్తులు పూరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతు నుంచి కౌలు అగ్రిమెంటు లేకపోతే దరఖాస్తులు చేయాలా వద్దా అన్న విషయం తెలియడం లేదు. పదెకరాలు ఉన్న రైతు మరో ఐదెకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. రెండు కలిపితే 15 ఎకరాలు అవుతుంది. దీంతో ఏ పథకానికి ఎసరుపడుతుందోనని భయపడుతున్నారు.

■ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో.. ఇళ్లు లేని వారికి ఆర్థికసాయం అనే కాలమ్ పెట్టారు. గ్రామాల్లో చాలా వరకు రెండు, మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉంటారు. వీరందరికీ ఒకే చిరునామా ఉంటుంది. ఒకరికి ఇచ్చి మిగిలిన వారిని తిరస్కరిస్తారేమో అన్న భయం పట్టుకుంది.

■ రేషన్‌కార్డు లేనోళ్లు ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు ఫారంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నక్లను జతచేయాలని చెప్పడంతో తమకు ఈ పథకాలు దక్కవని ఆందోళన చెందుతున్నారు.

■ గృహజ్యోతి పథకంలో.. సొంత ఊరిలో కాకుండా పలువురు పట్టణాల్లో పనిచేస్తూ అద్దె ఇళ్లలో ఉంటున్నారు.అలాంటి వారికి అద్దె ఇంట్లో ఉన్న విద్యుత్ కనెక్షన్‌కు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందో లేదో తెలియడం లేదు. ఆధార్‌కార్డులో ఉన్న ఇంటికే పరిమితం చేస్తారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు మీటర్లు ఉన్న వారు దరఖాస్తు చేయాలా లేదా అన్న సందేహం ఉంది. ఆయా సందేహాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సందేహాలను సంబంధిత అధికారులు నివృత్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సందేహాలను నివృత్తి చేయాలి



ప్రజాపాలన దరఖాస్తులపై ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన అధికారులు ఆయా సందేహాలపై ఏమాత్రం అవగాహన కల్పించకపోవడం, అర్హులకు సంబంధించిన బ్యాంకు ఖాతా నెంబర్ ఎక్కడ కూడా దరఖాస్తు ఫారంలో లేకపోవడంతో ఏ ఖాతాలో జమచేస్తారనే ప్రశ్న కలుగుతుంది.

– కోదండరాం, సీపీఎం నాయకుడు, రేమద్దుల

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ ఆదేశాల మేరకే ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సందేహాలపై గ్రామసభల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రేషన్‌కార్డు లేని వారు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. రైతు భరోసా, పింఛన్ వస్తున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఆయా పథకాలకు వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక రికార్డులో గ్రామాల వారీగా నమోదు చేస్తున్నాం.

– రఘురాములు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, పాన్‌గల్



కేతేపల్లిలో దరఖాస్తులు చేసేందుకు పోటెత్తిన జనం

రాములోరి అక్షింతల ఊరేగింపు



ఆత్మకూర్‌లో అక్షింతలను ఊరేగిస్తున్న వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో రామ అక్షతలకు పూజలు నిర్వహించారు. 33వ వార్డు ప్రజలకు దివ్యమైన అక్షతలను మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామ మందిరం ప్రారంభించనుండడంతో ప్రజలకు దివ్యమైన రామ అక్షతలు అందాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. రామ మందిరం ప్రారంభం రోజున మామిడి తోరణాలతో ప్రజలు పండగ జరుపుకోవాలని, అక్షతలను తలపై వేసుకున్న ప్రతీ ఒక్కరూ పునీతులు అవుతారని చెప్పారు. 60 కుటుంబాలకు రామ అక్షతలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమిత్రమ్మ, కవిత, అరుణ్, జ్ఞానేశ్వర్, పరశురాం, బాలయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా రామమందిర ట్రస్ట్ పంపిన అక్షతలకు మంగళవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు.



వనపర్తిలో..

స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అఖండజ్యోతిని వెలిగించారు. 2024 జనవరి 22న ఆయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు నిర్వహించేందుకు అక్షతలు అందజేస్తున్నట్లు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అశ్విన్ కుమార్, తమ్మలి విజయ్, మ్యాడం శ్రీను, నర్సింహారెడ్డి తెలిపారు. అక్షతలను మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ చేరవేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం రాము, కిషోర్, వెంకటేష్, లింగన్న, బాలకృష్ణ, బాలు తదితరులు ఉన్నారు.

చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉచిత యూనిఫాం, మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



గుటిపల్లిలో బడిబయటి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీ సౌమ్యరాణి

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

మదనాపురం: దేశంలో పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలపై మంగళవారం మండలంలోని గోపన్‌పేటలో 'మా సంకల్పం, అభివృద్ధి చెందిన భారత్' అనే పేరుతో ప్రచారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాయం వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక పథకాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం భారతదేశం మా మాతృభూమి అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులుయాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి వంశీ, బ్యాంక్ అధికారులు తదితతరులు పాల్గొన్నారు.



గోపన్‌పేటలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

వైద్య శిబిరాల ఏర్పాటు

పాన్‌గల్: మండలంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామసభల వద్ద వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవులు తెలిపారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, జమ్మాపూర్, కదిరెపాడు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తులు చేసేందుకు వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది ఆరోగ్యం, కరోనాకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తూ అవసరమున్న వారికి మందులను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు ప్రమీల, చిన్నమ్మ, కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాలలో కనీస వసతులు కల్పించాలి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తరగతి గదుల్లో మౌళిక వసతులు కల్పించి, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహ కార్యదర్శి రాఘవ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించింది. ఈమేరకు పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన భోజనశాల భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, గత ప్రభుత్వం అనుసరించిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా నిధులు మంజూరు చేయాలని కోరారు. మన ఊరు–మన బడి ద్వారా మంజూరైన పనులను చేపట్టి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహేందర్, అశోక్, ప్రశాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

250గజాల స్థలం జిల్లా కేంద్రంలో ఇవ్వాలి

కొత్తకోట రూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు వదిలిన అమరుల కుటుంబాలను 250గజాల స్థలాన్ని జిల్లా కేంద్రంలో అందరికీ ఒకే దగ్గర ఇవ్వాలంటూ కొత్తకోట మండలం మిరాసిపల్లికి చెందిన అమరురాలు కావలి సువర్ణ సోదరుడు, తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర కన్వీనర్ కావలి మన్నెం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలో భాగమైన 250 గజాల స్థలం మంజూరును వెంటనే చేపట్టాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.



కలెక్టర్‌కు విన్నవిస్తున్న అమరుల కుటుంబ సభ్యులు

బైక్ ప్రమాదం

చిన్నంబావి: అతివేగంతో బైక్ నడుపుతూ అదుపు తప్పి కిందపడడంతో యువకులకు గాయాలయిన ఘటన మండలంలోని వెలగొండ సమీపంలోని జమ్ములమ్మ ఆలయం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పెద్దమారుకు చెందిన శివ, వంశీ పెబ్బేరుకు నుంచి తమ స్వగ్రామానికి వెళ్తుండగా.. వెలగొండ సమీపంలో జమ్ములమ్మ ఆలయం వద్ద గల మలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. ప్రమాదంలో వారికి గాయాలు కావడంతో బాధితులను పెబ్బేరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

అమరచింత: పట్టణంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గురుస్వామి మాకం నరసింహులు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు కలశ ఊరేగింపు, 11 గంటలకు స్వామివారికి అభిషేకాలు, కుంకమార్చనలతో పాటు మధ్యాహ్నం 1:30 నిమిషాలకు టీపీసీసీ అధికార ప్రతినిధి, గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్, శ్రీలన్‌గౌడ్, అశోక్ గౌడ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సాయంత్రము 6:30 నిమిషాలకు అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలు పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని గురుస్వాములు అంజిగౌడ్, భాస్కర్, నరసింహులు గౌడ్ కోరారు.

వడ్ల బస్తాల చోరీ

చిన్నంబావి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సోమవారం రాత్రి దొంగలు చోరీ చేసిన ఘటన మండలంలోని పెద్దదగడలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దదగడకు చెందిన బోయ వీరయ్య వరి పంట కోసి ధాన్యాన్ని 46 సంచుల్లో నింపి కల్లంలో ఉంచి సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం కల్లం దగ్గరకి వెళ్లి చూడగా వడ్ల సంచులు కనబడలేదని వాపోయాడు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రేషన్ డీలర్ మృతి

కోడేరు: మండల కేంద్రంలోని 2వ రేషన్ డీలర్ రాములు(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. తెల్లవారుజామున శ్వాస ఆడటం లేదని కుటుంబసభ్యులకు తెలపగా వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం పరామర్శించి రూ.5వేలు, 3వ రేషన్ డీలర్ శారద, సీహెచ్ శ్రీనివాసులు రూ.5వేలు, క్వింటాలు బియ్యం అందజేశారు.

ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చుతామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం ఖిల్లాఘనపురంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను సర్పంచ్ వెంకటరమణతో పాటుగా పలువురు కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించారు. గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు పదేళ్లలో చేసిన అభివృద్ధి కేవలం మాటల్లోనే ఉందని, క్షేత్రస్థాయిలో ఎక్కడ లేదని దుమ్మెత్తిపోశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరమణ, నిర్మల, దేవేందర్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ కబీర్‌దాస్, ఎంపీఓ రాజు, ఉపాధి హామీ అధికారి సత్యనారాయణ ఉన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనిమెట్టలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యేతో పాటు జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, డాక్టర్ పీజే బాబు, భీసం చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ రాణి తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో కార్మికులకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



కొన్నూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పెద్దమందడి మండలంలో..

పెద్దమందడి మండలంలోని మోజర్లలో ఎంపీపీ రఘుప్రసాద్ ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునిత, ఉప సర్పంచ్ హరిచంద్రారెడ్డి, ఎంఈఓ జయశంకర్, మాజీ సర్పంచ్ గట్టుమన్యం తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: రాష్ట్రంలో దొరల పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలన తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కొన్నూర్ ప్రజాపాలన గ్రామసభలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్, ఎంపీటీసీ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీడీఓ నాగేంద్రం, నారాయణరెడ్డి ఉన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో 623 దరఖాస్తులు, మొట్లంపల్లిలో 670, రేచింతల 646 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు తెలిపారు. ఈ నెల 3న పిన్నంచర్ల, జూరాల, 4న మూలమల్ల, ఆరేపల్లి, 5న తిప్పుడంపల్లిలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేందర్, చైర్‌పర్సన్ గాయత్రి పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి, మస్తీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్లను స్పెషల్ ఆఫీసర్ స్వరణ్‌సింగ్ సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొంకన్‌వానిపల్లిలో 404, మస్తీపూర్‌లో 472 మంది నుంచి దరఖాస్తు పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల కోసం ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని పది వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కౌంటర్ల వద్ద దరఖాస్తు పత్రాలను పరిశీలించారు. శనివారం ఆయా కౌంటర్ల ద్వారా 599 మంది దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు ఎల్లస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి 921, కదిరెపాడు 389, జమ్మాపూర్ 516 దరఖాస్తులు కలిపి మొత్తం 1826 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి రహెమాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాయి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, మండల పశువైద్యాధికారి డా.శ్యామ్, సర్పంచ్‌లు అనిత, లక్ష్మయ్య, చెన్నమ్మ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో వార్డుకొక కౌంటర్ చొప్పున మొత్తం 14 కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారెంటీల కోసం 1,759 దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 351 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ ఉసేనప్ప తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: తూంకుంటలో 826, పుల్గర్‌చర్లలో 354 దరఖాస్తులు కలిపి మొత్తంగా 1,180 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పలువురు నాయకులు ప్రారంభించారు. వనపర్తి మండలంలోని నాచహళ్లి, కడుకుంట్ల, తూర్పుతండాలో 2,118, పెబ్బేరు మండలంలోని సూగూరు, కొత్త సూగూరులో 995, శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో 408 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓలు తెలిపారు.